బ్యాంకుల వద్ద రైతుల పాట్లు

- పట్టించుకోని అధికారులు
- క్యూలో రైతుల తోపులాటలు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొదటి, రెండో విడత రుణమాఫీ అమలు చేయడంతో లబ్ధిదారులైన రైతులు కొత్త రుణాలు తీసుకునేందుకు బ్యాంకుల వద్దకు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఈ క్రమంలో రెండో శనివారం, ఆదివారం వరుసగా రెండు రోజులు బ్యాంకులకు సెలవులు కావడంతో సోమవారం బ్యాంకుల వద్ద రైతుల రద్దీ తీవ్రంగా ఉంది. వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ పహాణీ, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకాలతో బ్యాంకుల వద్దకు ఉదయమే పెద్ద సంఖ్యలో వస్తున్నారు. తమ రుణమాఫీ అయిందా తెలుసుకునేందుకు, మాఫీ అయిన వారు కొత్తరుణాలు తీసుకునేందుకు తదితర పనులపై రైతులు అధిక సంఖ్యలో వస్తుండగా బ్యాంకుల వద్ద రద్దీ నెలకొంటోంది.
ప్రధానంగా మండలంలోని శివునిపల్లిలోని జఫర్‌గఢ్ శాఖ బరోడాబ్యాంక్ వద్ద రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతులు ఉదయాన్నే బ్యాంకు



క్యూలో రైతుల తోపులాటలు

వద్దకు వచ్చి క్యూలో నిల్చున్నారు. సోమవారం ఎండ తీవ్రంగా ఉండటం, బ్యాంకు వద్ద తాగునీరు, టెంటు సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పురుషులు, మహిళా రైతులు వేర్వేరుగా లైన్లలో ఉన్నప్పటికీ రద్దీ బాగా ఉండటంతో తోపులాటలు జరిగాయి. లైన్ల విషయంలో బ్యాంకు సిబ్బంది ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో రైతులకు తిప్పలు తప్పలేదు. కొందరు రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో ఉన్నా పనికాని వారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. క్యూలలో ఇష్టారాజ్యంగా తోపులాటలు జరగడం, లైన్లను నియంత్రించేందుకు సిబ్బంది ఎవ్వరూ లేకపోవడంతో రైతులకు గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై బ్యాంకు అధికారులు తక్షణమే స్పందించి రైతులకు టెంటు, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు లైన్లలో క్రమపద్ధతిలో వచ్చేలా ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



కొడకండ్ల: క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి

కొడకండ్ల: శరీద ధారడ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగుల క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభను చాటిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నేపీఓ కుమారస్వామి, ఈసీ రమేష్, టీఏ భాస్కర్, యాకయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో రాణించాలి

లింగాలఘణపురం: మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో రాణించాలని ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, తహసీల్దార్ వినయలత కోరారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ క్రికెట్ జట్లు పోటీ పడ్డాయి. ఈ సందర్భంగా గెలుపొందిన తహసీల్దార్ జట్టుకు అభినందనలు తెలిపారు. అదే విధంగా మహిళ ఉద్యోగులకు కుర్చీ, స్పీడ్ వాక్, పురుషులకు రన్నింగ్ పోటీలను నిర్వహించారు. క్రీడల్లో ఎంపీఓ రఘురామకృష్ణ, సూపరింటెండెంట్ సీతారామనాయుడు, పీడీ బిక్షపతి, ఆర్‌ఐ కిశోర్, సీనియర్ అసిస్టెంట్ భగత్, పంచాయితీ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులకు నిర్వహించిన క్రీడలను ఎంపీడీఓ రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. మొదటి రోజు ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శుల జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించగా కార్యదర్శుల టీం విజయం సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, పీఈటీలు మామిండ్ల సోంమల్లు, కొడిశాల అశోక్, కూటికంటి శ్రీనివాస్, అందె మంజుల, సుస్మిత, మధు, గణేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ అధికారుల ‘పొలంబాట’



రఘునాథపల్లి: పొలాల్లో విద్యుత్ పరంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి అవగాహన కల్పించేందుకు విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీఈ మనోహర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతుల పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈ రాహుల్, ఎల్ఐ స్వామి, వెంకట్ రెడ్డి, ఎల్ఎం జగదీశ్వర్ రైతులు యాదగిరి, సుమన్‌రెడ్డి, సోమయ్య, చంద్రయ్య, వీరమల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సీఐని కలిసిన హెచ్ఆర్సీ నాయకులు

జనగామ రూరల్: జనగామ సీఐ దామోదర్ రెడ్డిని, ఎస్సై రాజ్‌కుమార్‌ను సోమవారం సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. బి.అరుణ్‌కుమార్, ఆర్.తిరుపతి, రాజు, బక్క శ్రీను, ఉమాపతి, మంగ సురేష్, రేవెల్లి తదితరులు ఉన్నారు.

సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి.వేణును మండలంలోని శివునిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ గుర్రం పాతికుమార్ ఆధ్వర్యంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పూలమొక్క అందజేశారు. నాయకులు గుర్రం కుమార్, సయ్యద్ అయాజ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు ఇటీవల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌ను పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు గిరెడ్డి ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కొమురయ్య, సంపత్, కొండ రవి, గజ్జెల రాజు ఉన్నారు.


బస్‌పాస్ మేళా

తరిగొప్పుల: సదరం క్యాంపు ధ్రువీకరణ పత్రం కలిగిన దివ్యాంగులు బస్‌పాస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్-1 డిపో అధికారి వంగాల మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలకేంద్రం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన మేళాలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులు ఆయన అందజేశారు. కార్యక్రమంలో మ్యాకల కిష్టయ్య, మాటూరి రమేష్, మేర్గొజు సుధాకర్, వక్కాల వేణు, సుంకరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల అందజేత

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన పేద విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను అందించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిటి విద్యానాథ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలకు తన వంతు సాయం అందిస్తున్నానని తెలిపారు. మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నాయకులు బాలకిషన్‌గౌడ్, అయిలుమల్లయ్య, హరీష్, తిరుపతిరెడ్డి, క్రాంతి, ఉపేందర్‌రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బచ్చన్నపేట: కరాటే పోటీల్లో బచ్చన్నపేట, జనగామ, ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని కరాటే మాస్టర్ విక్రమ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో వేద కరాటే అకాడమీ విద్యార్థులు 19 మంది పాల్గొని 8 బంగారు, 6 రజత, 5 కాంస్య పథకాలను సాధించడంతోపాటు ట్రోఫీని కూడా అందుకున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్ అభినందించారు. కాగా, మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన పోతుల అశ్విని-కర్ణాకర్ దంపతుల కూతురు మనోజ్ఞ పోటీల్లో రజత పతకం సాధించడంతో ప్రిన్సిపాల్ భాస్కరుని సుమలత, గ్రామస్తులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

లింగాలఘణపురం: లింగాలఘణపురం ఎస్సైగా బండి శ్రావణ్‌కుమార్ ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై చింత రాజు ఇంతేజార్‌గంజ్‌కు బదిలీపై వెళ్లగా కొడకండ్లలో పని చేసిన శ్రావణ్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. పది రోజుల క్రితమే బదిలీ ఉత్తర్వులు వెలువడినప్పటికీ కొడకండ్లలో పని ఒత్తిడి నేపథ్యంలో ఎట్టకేలకు ఆదివారం రాత్రి విధుల్లో చేరారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని మహదేవస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే దర్శనానికి వచ్చిన భక్తులు అర్చకులు పిండిప్రోలు శ్రీనివాసశర్మ వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేసి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్‌గుప్త- రేణుక, లాగిశెట్టి లింగయ్య, ఆకుల జ్యోతి, కొన్నేరు రమ, మంజుల, జానకి పాల్గొన్నారు.

బండలగట్టు శివాలయంలో..

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ పంచాయతీ పరిధిలోని బండలగట్టు శివగంగేశ్వరి ఆలయంలో భక్తులు శ్రావణ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్పూరుకు చెందిన గాదె రాజేందర్-స్వప్న, శేఖర్-ఝాన్సిరాణి, రాజమయ్య- రాజమ్మ, పూర్ణచందర్, అర్జున్, శాన్వికలు కోడెను ఆలయ నిర్మాణ దాత, అర్చకుడు వేల్పుల లక్ష్మిగట్టయ్యకు అందజేశారు.

జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: సెప్టెంబర్ 1 నుంచి 17వ తేదీ వరకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో చేపట్టే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. పీఎన్ఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి రాంపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు సాంబరాజు యాదగిరి, మునిగెల రమేష్, గట్ల మల్లారెడ్డి, తొడెంగల ఐలయ్య, కత్తుల రాజు, ఎం.కరుణాకర్, పరమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

జనగామ రూరల్: 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే కార్మికుల డీఏలను వెంటనే విడుదల చేయాలని ఆలేరు బ్రాంచి చైర్మన్ తిరుమల్ రావు డిమాండ్ చేశారు. ఏఐఆర్ఎఫ్ ఎస్‌సీఆర్‌ఎంయూ పిలుపు మేరకు సోమవారం జనగామ రైల్వేస్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ దేవరాజు, ఏలేందర్, కోశాధికారి శ్రీశైలం, తిరుపతి, భాస్కర్, మేడ మల్లేష్, కిరణ్, నరేష్, రవి,గోవింద్ జగదీష్, రాజ్యలక్ష్మి, అనిత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

పాపన్న జయంతిని విజయవంతం చేయాలి



చిల్పూరు: ఈనెల 14వ తేదీన మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలకు గౌడ సంఘం సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేశ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కేజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాలకు జిల్లా నాయకులు హాజరవుతున్నందున ప్రతీ గ్రామంలోని సొసైటీ నుంచి 10 మంది హాజరు కావాలన్నారు. ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మోడెం విజయభాస్కర్, నారగోని రాజు, గొల్లపల్లి సారయ్య, సట్ల లింగయ్య, డిష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు ఉండొద్దు

- కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

బచ్చన్నపేట : రాష్ట్రంలో భూ సమస్యలు ఉండకూడదు.. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధరణి కమిటీని నియమించినట్లు కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి అన్నారు. సోమవారం బండనాగారం గ్రామానికి చెందిన రైతుల భూసమస్యలు సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారులో ఉండడంతో తెలుసుకోవడానికి గ్రామానికి వచ్చిన ఆయన రైతులతో మాట్లాడారు. బండనాగారం, బంజేరు గ్రామాల రైతులకు సంబంధించి దాదాపు 30 మందికి 45 ఎకరాల భూమికి పట్టా పాసుపుస్తకాలు అందలేదని, గ్రామంలో ఓ వ్యక్తి ఆ భూమిని మొత్తం పట్టా చేసుకొని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. భూమి పట్టా లేకుంటే రైతు భరోసా, రైతు బీమా వర్తించడం



రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి

లేదని, బ్యాంకుల్లో పంటల రుణాలు తీసుకోవడానికి తంటాలు పడుతున్నారని తెలిపారు. త్వరలోనే ఆర్‌ఓఆర్-2024 చట్టం తీసుకురాబోతున్నామని, అప్పుడు దరఖాస్తు చేసుకొని పట్టా పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ విషయమై రెవెన్యూ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడి అవసరమైతే సీఎం దృష్టికి తీసుకుపోతానని అన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణరెడ్డి, రైతులు జంగిలి యాదగిరి, ఆంజనేయులు, సాయిబాబా, స్వామి, తిరుపతి, ఉప్పలయ్య ఉన్నారు.

పాఠశాలకు బోరు మోటార్ వితరణ



బోరు మోటర్ వద్ద హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు ఎన్ఆర్ఐ పులిగిళ్ల శ్రీనివాస్ బోరు మోటరును అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో తాగు నీటి ఇబ్బంది ఉందని బోర్ మోటార్ ఏర్పాటుకు సాయం చేయాలని కోరగా ఆయన స్పందించి రూ.50వేలు అందజేశారని చెప్పారు. బోరు మోటరుతో పాటు కొత్త పైపు లైను, ట్యాంకులు, నల్లాలను కూడా బిగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు భాస్కరుని పృథ్వీరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం గ్రామాల్లో ఓటరు జాబితాను సమర్థవంతంగా తయారుచేయాలని డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులు, బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా తయారీలో అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలు, వార్డుల వారీగా లిస్టులు సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా ఒక కుటుంబం ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్, ఎంపీఓ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జున్

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: ఓటరు లిస్టులో సవరణలు చేపట్టి జాబితా తయారు చేయాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు లిస్టును సిద్ధం చేయాలన్నారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘన్‌పూర్ పీహెచ్‌సీ వారి ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా హెల్త్‌క్యాంపును నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో 170 మంది విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జనార్దన్, సంధ్య, సీహెచ్‌ఓ వెంకటస్వామి, డాక్టర్ పవన్, సూపర్‌వైజర్ సునంద, ఏఎన్‌ఎంలు భవాని, ప్రేమలత, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

కొడకండ్ల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమరుల యాదిలో గీతన్నల చైతన్యయాత్రలో భాగంగా ఆయన మాట్లాడారు. గీత వృత్తిదారులందరికీ సేఫ్టీ మోకులు ఉచితంగా అందించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి గురై మృతి చెందిన బాధిత రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, తాత్కాలిక దివ్యాంగులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందించాలన్నారు. బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించి కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం, చంద్రమౌళి, రాములు, శేఖర్, వెంకన్న, శ్రీను, ఉప్పలయ్య, సమ్మయ్య, నాగయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యరహిత సమాజం కోసం పాటుపడాలి

దేవరుప్పుల: విద్యార్థి దశ నుంచే వ్యసనాల బారిన పడకుండా మాదక ద్రవ్యరహిత సమాజం కోసం పాటుపడాలని కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఈటీ కృష్ణ, ఉపాధ్యాయులు మదన్‌మోహన్, ఖాజా, మహేష్, మాధవి, విజయలక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసురాజు

సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ ధ్యేయం

స్టేషన్‌ఘన్‌పూర్: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావం నుంచి నేటి వరకు విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా కామన్ విద్యావిధానం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడుతూనే ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మహమ్మద్ యూనిస్ అన్నారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎండీ.రహ్మతుల్లా, చింత జగదీష్, పృథ్వీరాజ్, రాము, అక్షయ, జీవన్ పాల్గొన్నారు.

అభినందనీయం



పాలకుర్తి: వెన్నెల ఉమారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. సోమవారం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి యాకయ్య, ఆయన సతీమణి ఉమారాణి పలు పాఠశాలల్లో విద్యార్థులకు గొడుగులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. గిరగాని కుమార్, కారుపోతుల శ్రీనివాస్, యాకసోమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామంలో మృతి చెందిన గోరంత మల్లేశం కుటుంబ సభ్యులకు సామాజిక సేవా కర్త పోతుల రాములుయాదవ్ సోమవారం రూ. 5వేల సాయం అందజేశారు.

గువ్వలగూడెంలో..

జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామ శివారు గువ్వలగూడేనికి చెందిన నీరటి దేవేందర్ ఇటీవల మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న పదోతరగతి మిత్రులు బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం సోమవారం అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దేవరుప్పుల: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గరాజుపల్లి, పెద్దమడూరులో ప్రమాదానికి గురైన మేకపోతుల రేణుక, బోనగిరి సైదులును పరామర్శించి, పెద్దమడూరు, దేవరుప్పులలో మృతి చెందిన మోటకొండూరు శ్రీనివాసాశర్మ, ఊడుగు ముత్తమ్మ, సీతారాంపురంలో భాషిపాక స్వప్నల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పల్ల సుందర్‌రామిరెడ్డిఉన్నారు.

పెద్ది కృష్ణమూర్తికి..

కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తికి తల్లి లచ్చమ్మ మృతి చెందింది. కాగా, విదేశీపర్యటనలో ఉన్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సోమవారం ఫోన్‌లో ఆయనను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన గంగిరెడ్డి నర్సయ్య(85) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లింగన బోయిన శ్రీనివాస్ పరామర్శించారు. నర్సయ్య మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

‘రైతు నేస్తం’ను వినియోగించుకోండి

తరిగొప్పుల: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నేడు మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు వినియోగించుకోవాలని ఏఈఓ జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నేరుగా రైతులతో ముఖాముఖి మాట్లాడడం జరుగుతుందని తెలిపారు. వివిధ పంటల సంబంధించిన సాగు పద్ధతులను నేర్చుకోవాల్సిందిగా సూచించారు.

సంక్షిప్త సమాచారం

నియామకం

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ యువజన గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నోముల రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాగేష్‌గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నోముల రాజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎస్ఆర్ రంగనాథన్ జయంతి



జనగామ రూరల్: గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పట్టణంలోని గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కృష్ణ మాట్లాడుతూ రంగనాథన్ గొప్ప గణిత శాస్త్రవేత్త అని, గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న ప్రముఖుల్లో ఒకరని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశేషంగా కృషి చేశారని కొనియాడారు. పాఠకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీఐ దంపతులకు గాయాలు

పాలకుర్తి: రోడ్డు ప్రమాదంలో పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి అర్వపల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. ఆదివారం సూర్యాపేటలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి రాత్రి కుటుంబంతో సీఐ కారు డ్రైవ్ చేస్తూ వస్తుండగా ఎదురుగా వచ్చిన కారును తప్పించబోయి హోటల్‌లోకి దూసుకెళ్లారు. ఈ ఘటనలో సీఐ మహేందర్ రెడ్డి, ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, వారికి సూర్యాపేటలో ప్రథమ చికిత్స చేయించి హైదరాబాద్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు.

మహిళకు..

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల బస్‌స్టాండ్ సమీపంలో సోమవారం రోడ్డు దాటుతున్న మహిళను టిప్పర్ ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వేలేరు మండలం గుండ్లసాగరం గ్రామానికి చెందిన టేకుల రాజమ్మ చిన్నపెండ్యాల వద్ద జనగామకు వెళ్లే బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో ముందు టైరు కింద పడింది. అప్రమత్తమైన డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో రాజమ్మ తీవ్రగాయాలతో బయట పడింది. ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి, గాయపడిన మహిళలను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

మల్కాపూర్‌లో బెల్ట్ షాపుపై దాడి..

మండలంలోని మల్కాపూర్‌లోని తిరుమల కిరాణా షాపులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఆ షాపుపై దాడి చేయగా అక్రమంగా నిల్వ చేసిన రూ.36 వేల మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు బూర రామనాథంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

చికిత్స పొందుతున్న తండ్రీకొడుకుల మృతి

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రీకొడుకులు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బానాజీపేట గ్రామానికి చెందిన తాటికాయల కొమురయ్య కొన్నాళ్లుగా కుటుంబంతో కలిసి హైదరాబాద్ చిలకలగూడలో స్థిరపడ్డారు. ఈ నెల 11న కొమురయ్య ఆటోలో తన కుటుంబ సభ్యులతో కలిసి నిడిగొండలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి వెళ్తూ క్రాసింగ్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హనుమకొండ నుంచి జనగామ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టిన విషయం విదితమే. ప్రమాదంలో ఆటోలో ఉన్న కొమురయ్య (60), అతని కుమారుడు కుమారస్వామి(40)కి తీవ్ర గాయాలయ్యాయి. కోడలు స్వప్న, మనుమడు కిషోర్‌లకు గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన తండ్రీకొడుకులను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ..

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ సమీపంలో సోమవారం వాహనం ఢీకొని ఓ గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఆమె మృతదేహంపై నుంచి పలు వాహనాలు వెళ్లగా నుజ్జునుజ్జు అయింది. మృతురాలు ఎరుపు రంగు చీర ధరించి ఉందని, ఎరుపు రంగులో ఉందని, సుమారు 50 సంవత్సరాల వయసు ఉందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించామని, ఎవరైనా గుర్తిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 8712685037 నంబర్‌లో సంప్రదించాలని సీఐ వేణు తెలిపారు.